క్లుప్తంగా

మున్సిపాలిటీలో 95.63 శాతం పింఛన్ల పంపిణీ

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో సామాజిక పింఛన్లను శనివారం 95.63శాతం పంపిణీ చేసి జిల్లాలోనే రెండో స్థానంలో నిలిచినట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. పట్టణంలో మొత్తం పింఛన్లు 4,505 ఉండగా, శనివారం 4,308 మందికి పింఛన్ పంపిణీ చేసినట్టు తెలిపారు. మిగిలిన 197 పింఛన్లు ఆదివారం అందజేయనున్నట్టు పేర్కొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు



సమస్యలు తెలుపుతున్న సభ్యులు

సదుం: పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చర్యలు తప్పవని తహసీల్దారు జయప్రకాశ్ హెచ్చరించారు. ఆయన శనివారం తహసీల్దార్ కార్యాలయంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. మిట్టపల్లెలో గ్రామ కంఠం కొందరి ఆధీనంలో ఉందని, ప్రస్తుతం రీసర్వే జరుగుతున్నందున ఆ భూమిని గుర్తించి దానిని కాపాడాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. కంభంవారిపల్లె, చింతలవారిపల్లె, సజ్జలవారిపల్లె, మారుతివారిపల్లెలో ప్రభుత్వ భూమిని నిరుపేద కూలీలకు పంచాలని కోరారు. ఎస్ఐ షేక్ షా వలీ, సర్పంచ్ ఉషారాణి, సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్ షరీఫ్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మండల చైర్మన్ సీతాపతి, రాంబాబు పాల్గొన్నారు.

మండల కేంద్రానికి చేరుకున్న విద్యా సామగ్రి



ప్రభుత్వ గోడౌన్‌కు చేరుకున్న పుస్తకాలు

కుప్పంరూరల్: ప్రభుత్వ పాఠశాలలకు అందించే విద్యా సామగ్రి మండల కేంద్రానికి చేరుకున్నట్లు ఎంఈవో -2 రాజారామ్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 12న తెరవనున్న నేపథ్యంలో ముందుగానే పాఠశాలలకు అందజేస్తున్నట్లు తెలిపారు.

చౌడేశ్వరీదేవి ఆలయంలో వార్షిక పూజలు

సదుం: మండలంలోని జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో 11వ వార్షికోత్సవ పూజలు శనివారం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. విశేషాలంకారంలో ఉన్న అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు. అన్నదానం చేశారు.

14 మందికి సీఎం సహాయ నిధి

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలో సీఎం సహాయ నిధి ద్వారా 14 మందికి సుమారు రూ.15 లక్షలు ఆర్థికసాయం చేసినట్లు అధికార పార్టీ వర్గాలు తెలిపాయి.

సర్టిఫికెట్ల కోసం ప్రదక్షిణలు

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కగానే దాడులు, దౌర్జన్యాల మీద దృష్టి పెట్టింది. ప్రజల సమస్యలను పక్కనపెట్టి కక్షసాధింపులకు ప్రాధాన్యత ఇచ్చింది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ ఆస్తులను దోచేస్తూ, మరోవైపు ప్రజలకు అందుబాటులో ఉన్న వసతులన్నీ దూరం చేసింది. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ప్రజల వద్దకే పాలన అనే విధానాన్ని తీసుకొచ్చింది. ప్రజల గడప వద్దకే సంక్షేమ పథకాలు అందించింది. అందులో భాగంగానే విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లు ఇంటి వద్దనే పంపిణీ చేసింది. కూటమి సర్కార్ మాత్రం వారాల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటోంది. దీంతో విద్యార్థులకు మళ్లీ సర్టిఫికెట్ల కోసం కష్టాలు మొదలయ్యాయి.

- గతంలో జగనన్న సురక్ష పేరిట ప్రత్యేక డ్రైవ్
- పనులన్నీ వదిలేసి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం
- అధికారులెప్పుడొస్తారో వెళతారో తెలియదు



చౌడేపల్లెలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

చౌడేపల్లె: ప్రతి ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ పథకాలను అర్హతే ప్రామాణికంగా కుల మతాలకు పార్టీలకు అతీతంగా పథకాలను వలంటీర్ల ద్వారా గడప వద్దకే అందించిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే సొంతం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ కుట్రలు, కక్షలు, దౌర్జన్యాలతో పేదలకు పథకాలు అందించకపోగా, ప్రజలకు అందుబాటులో ఉన్న సచివాలయ వ్యవస్థను దశల వారీగా నిర్వీర్యం చేస్తున్నారు. గత ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు విద్యార్థులకు అవసరమైన పత్రాలను ఇంటి వద్దనే అందజేసేవారు. దీంతో పాఠశాలల్లో చేరడానికి, కొత్త కళాశాలల్లో ప్రవేశాలకు విద్యార్థులకు ఇబ్బందులుండేవి కావు. మరి ఇప్పుడేమో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ అవసరం ఉన్నా, ఏమి కావాలన్నా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారుల వద్దకు వెళ్లి ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సర్టిఫికెట్లకోసం విద్యార్థులు, యువత సచివాలయాలు, మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు అందుబాటులోలేక అవస్థలు పడుతున్నారు. పిల్లల తల్లిదండ్రులైతే కూలీనాలీ వదిలేసి అధికారుల కోసం కార్యాలయాల వద్ద పడిగాపులు గాస్తున్నారు. సిబ్బందికోసం వెళితే సర్వే కోసం వెళ్లామని, మీటింగ్ ఉంటే వెళ్లామని చెబుతూ సకాలంలో అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది.

కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది



సర్టిఫికెట్ల కోసం గతంలో వలంటీర్లు అధికారులతో సంప్రదించి మాకు అవసరమైన సర్టిఫికెట్లు మాఇంటికే ఒకటి లేదా రెండు రోజుల్లో తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయం వద్దకెళ్లి మేమే దరఖాస్తు చేసుకొని నగదు చెల్లిస్తే వారం రోజులైనా సర్టిఫికెట్లు చేతికందడంలేదు. అధికారుల చుట్టూ తిరిగి మేమే సంతకం చేసుకోవాల్సిన దుస్థితి.

– రమణారెడ్డి, చౌడేపల్లె మండలం

అత్యవసరమైతే..



కళాశాలలో ప్రవేశానికి, ఇతర ఉద్యోగాలకు, స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలంటే కులం, ఆదాయం సర్టిఫికెట్లు అవసరం ఉంది. గతంలో ఒక్కరోజులోనే మాకు కావాల్సిన సర్టిఫికెట్లు జారీచేసేవారు. కూటమి సర్కారు హయాంలో ఇప్పుడు దరఖాస్తు చేసుకుంటే ఎప్పుడొస్తాయో తెలియని పరిస్థితి. కార్యాలయాల చుట్టూ కాళ్లు తిరిగేలా తిరగాల్సి వస్తోంది.

– నందిని, విద్యార్థిని, చౌడేపల్లె మండలం

గత సేవలు కొనసాగించాలి



గత ప్రభుత్వంలో సచివాలయాల్లో పలు రకాల సేవలు అందుబాటులో ఉండేవి. ప్రస్తుత ప్రభుత్వం ఆ సేవలను దూరం చేస్తూ చర్యలు తీసుకుంటోంది. ఉన్న ఉద్యోగులను కుదిస్తున్నారు. సేవల కోసం మళ్లీ సచివాలయాలను వదిలి మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. సచివాలయ ఉద్యోగులను గతంలో లాగా కొనసాగిస్తూ సేవలన్నీ అందించాలి.

– సీతాపతి, ఊటుపల్లె, సదుం మండలం



సదుం: సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకుంటున్న తల్లిదండ్రులు, విద్యార్థులు,



చౌడేపల్లె: సర్టిఫికెట్ల పంపిణీ క్యాంపులో అధికారులు (ఫైల్)

పలమనేరు ఎంపీడీవోగా భాస్కర్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీడీఓ భాస్కర్

పలమనేరు: పలమనేరు ఎంపీడీవోగా భాస్కర్ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన పెద్దపంజాణి మండల ఏవోగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఎంపీడీవోగా ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఖాదర్‌బాషా రెండ్రోజుల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. కొత్త ఎంపీడీవోకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. తాను ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

ట్రాక్టర్ లోడ్‌పై ప్రయాణం ప్రమాదం



పులిచెర్ల చుట్టుపక్కల మండలాలనుంచి దామల చెరువు మార్కెట్‌కు కల్లూరు మార్గం గుండా నిత్యం వందలాది ట్రాక్టర్లలో మామిడి కాయలు వెళుతుంటాయి. మామిడి కాయల లోడుపై జనం కూర్చొని ప్రయాణిస్తుటారు. ఈ మార్గం పూర్తిగా ఘాట్‌రోడ్డు. ఏదైనా వాహనం అదుపుతప్పితే ప్రాణనష్టం జరిగే అవకాశం ముంది. ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలపై పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది.

– కల్లూరు

అధికారుల తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం





మాట్లాడుతున్న చైర్‌పర్సన్ చాముండేశ్వరి, అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ కోదండరామయ్య

పలమనేరు: మాజీ ఎంపీ ఎస్ రెడ్డెప్ప నిధుల ద్వారా పట్టణంలో నిర్మించిన బస్సు షెల్టర్లపై ఆయన పేరును ఎందుకు రాయలేదని కౌన్సిలర్ కోదండరామయ్య అధికారుల తీరుపై మండిపడ్డారు. మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ సమావేశపు హాలులో మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం నిర్వహించారు. పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరును ఎండగట్టారు. ఆ షెల్టర్లపై తప్పకుండా పేరు రాయిస్తామని మున్సిపల్ డీఈ సమాధానం ఇచ్చారు. ఇటీవల కురిసిన వర్షాలకు కాలువపల్లి సమీపంలోని వైఎస్సార్ జలాశయానికి నీరు చేరిందని అక్కడి నుంచి పట్టణానికి వచ్చే పైపులైన్లు పలు చోట్ల దెబ్బతిన్నాయని చెప్పారు. హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద ఓ వ్యక్తి పైప్‌లైన్‌ను జేసీబీతో ధ్వంసం చేసి ఆ స్థలాన్ని ఆక్రమించుకున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కోవిడ్ కష్టాలు మళ్లీ వచ్చే అవకాశం ఉన్నందున పట్టణంలోని అర్బన్, ఏరియా ఆస్పత్రుల్లో అవసరమైన సౌకర్యాలను ఎంతవరకు చేపట్టారని కోదండరామయ్య ప్రశ్నించారు. రాధా బంగ్లా సమస్యలపై గత రెండు సమావేశాల్లో తెలిపినా చర్యలు లేవని వార్డు కౌన్సిలర్ శ్యామ్‌సుందర్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. కాకాతోపులో విద్యుత్‌సమస్య, శనీశ్వరాలయం వద్ద బ్రిటీష్‌కాలం నాటి రోడ్డు ఆక్రమణ, ఆర్టీసీ బస్టాండులో షాపింగ్‌కాంప్లెక్స్ నిర్మాణాలతో ఇబ్బందులు తప్పవని ఆయా వార్డు కౌన్సిలర్లు గుల్జార్, కిరణ్, మురళీకృష్ణ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సభ్యులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని చైర్‌పర్సన్ సూచించారు. మరోవైపు అజెండాలోని అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సమావేశంలో కమిషనర్ రమణారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు.

పొగాకుతో ప్రాణాంతక వ్యాధులు



సదుం: అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది

సదుం: పొగాకు వినియోగం ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతుందని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టరు గిరీశా తెలిపారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గ్రామంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సిబ్బంది ఉదయ భాస్కర్, నీలకంఠ, జానకి, శిఖామణి పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండల కేంద్రంలోని పురవీధుల్లో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్లు దినేష్ కుమార్ నాయక్, వినయ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పొగాకు వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: మండలంలోని తీర్థం గ్రామంలో శనివారం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్‌ఎస్ శ్రీదేవి, పంచాయితీ కార్యదర్శి రాజశేఖర్, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

గంగవరం: మండల కేంద్రంలో వైద్యాధికారి లహరి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. పొగాకు అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.





రొంపిచెర్ల: ర్యాలీలో పాల్గొన్న వైద్య, ఆరోగ్య సిబ్బంది, బైరెడ్డిపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యసిబ్బంది



గంగవరం: ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

వెనుకబడిన వేరుశనగ

- మండలానికి చేరిన 715 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలు
- గత ప్రభుత్వం పంపిణీ చేసింది 1100 క్వింటాళ్లు
- బీళ్లుగా మారుతున్న వ్యవసాయ భూములు

రొంపిచెర్ల: ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. మండలంలో 2,200 ఎకరాల్లో వేరుశనగ సాగు చేసేవారు. గత సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట వర్షాభావంతో దెబ్బతినడంతో ప్రభుత్వం కరువు మండలంగా ఎంపిక చేసింది. అయినా ఇంత వరకు రైతులకు ఒక పైసా కూడా పరిహారం మంజూరు చేయలేదు. గత ప్రభుత్వం ప్రతి ఏడాది రైతులు సాగు చేసుకునేందుకు ముందుగానే రైతు భరోసా పథకం కింద ఆర్థిక సాయం అందించేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదవుతున్నా ఇంత వరకు ఇన్‌పుట్ సబ్సిడీ గానీ, రైతులకు ఆర్థిక సాయంగానీ మంజూరు చేయలేదు. దీనికి తోడు ఈ ఏడాది టమాట, దోస, పంటల సాగులో గిట్టుబాటు ధరల్లేక పూర్తిగా రైతులు నష్టపోయారు. దీంతో వ్యవసాయ పంటలు సాగు చేసేందుకు రైతులు భయపడుతున్నారు. ప్రతి పంట సాగులోనూ నష్టలు తప్ప లాభాలు లేవు. ఇప్పుడు మళ్లీ పంటలు ఎలా సాగు చేయాలని భయపడిపోతున్నారు. మండలంలో కొందరు రైతులు మాత్రం దుక్కులు దున్ని సబ్సిడీ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. మరి కొందరు ఈ ప్రభుత్వం ఆదుకుంటుందన్న నమ్మకం లేక భూములను బీళ్లుగా వదిలేశారు.



రొంపిచెర్లలో రైతు సేవా కేంద్రంలో దించుతున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాలు



రొంపిచెర్ల మండలంలో గతంలో సాగు చేసిన వేరుశనగ పంట(ఫైల్)

సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు 40 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలను ఇస్తామని అన్నారు. మొదటి విడతగా 715 క్వింటాళ్ల విత్తనాలు మండలానికి వచ్చాయని తెలిపారు. ఒక రైతుకు ఒక బస్తా చొప్పున 30 కిలోల బస్తా రూ.1,674 ఇస్తామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. గత సంవత్సరం 1,100 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేయగా కేవలం 438 ఎకరాల్లో మాత్రమే పంట సాగు చేశారని తెలిపారు. దీంతో ఈ ఏడాది 715 క్వింటాళ్ల విత్తనాలు వచ్చాయని తెలిపారు.

– సుధారాణి, వ్యవసాయ అధికారి

'రియల్' గోల్‌మాల్

- మున్సిపాలిటీలో అనుమతులున్న లేఅవుట్లు మూడే!
- 37 లేఅవుట్లు అప్రూవల్ కాలేదని తేల్చిన అధికారులు
- అప్రూవల్ ఉందంటూ ఏమార్చుతున్న దళారులు
- అక్రమ లేఅవుట్లలో స్థలాలు కొన్నవారికి తప్పని తిప్పలు



మున్సిపాలిటీలో అక్రమ లేఅవుట్లను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: రియల్ ఎస్టేట్ వ్యాపారులు గోల్‌మాల్ చేస్తున్నారు. అనుమతి లేకున్నా ఉందంటూ స్థలాలు విక్రయించేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 40 లేఅవుట్లు(వెంచర్లు)ఉండగా కేవలం మూడింటికి మాత్రమే అనుమతులున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి శనివారం స్పష్టం చేశారు. ఇన్నాళ్లూ అప్రూవల్స్ ఉన్నాయంటూ ఏమార్చిన రియల్టర్లు, రియల్ బ్రోకర్లు చెప్పిన మాటలు తప్పని తేలింది. విషయం తెలియక ఇప్పటికే నిబంధనలు పాటించని లే అవుట్లలో స్థలాలు కొన్నవారికి తిప్పలు తప్పేలా లేవు. వీరు ఇంటి నిర్మాణాలు చేయాలంటే అన్ని రకాల అనుమతులను స్వయంగా డబ్బులు వెచ్చించి చేసుకోవాల్సిందే. దీంతో వీరికి అదనపు భారం తప్పనట్టే. మరోవైపు అనుమతులు లేని లేఅవుట్లలో ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించేదిలేదని మున్సిపల్ అధికారులు తేల్చి చెబుతున్నారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాలతో రంగంలోకి దిగిన అధికారులు అక్రమ లేఅవుట్లను తనికీ చేసి వాటి వద్ద హెచ్చరిక బోర్డులను నాటించారు.

యథేచ్ఛగా విక్రయాలు

ఓ భూమిని నలుగురు భాగస్వాములుగా కొని కొంత బయానా చెల్లించి అగ్రిమెంట్‌తోనే భూమిని చదునుచేసి రాళ్లునాటి స్కెచ్‌చేత బట్టి సైట్ల అమ్మకాలు సాగించేస్తున్నారు. అయితే అన్ని అనుమతులున్న లేఅవుట్‌లో మాత్రమే క్రయవిక్రయాలు జరపాలంటూ సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయాలకు కమిషనర్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ నుంచి ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కొందరు కోర్టుకెళ్లడంతో రిజిస్ట్రేషన్లకు, అనుమతులకు సంబంధం లేదని కోర్టు చెప్పింది. దీంతో మళ్లీ అనుమతులు లేని లేఅవుట్లలో సైట్ల రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి. కొనేముందు రియల్ దళారుల మాయమాటలను నమ్మకుండా స్థానిక మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌ను సంప్రదించాలని అధికారులు చెబుతున్నారు.

కిక్కిరిసిన సంత



బైరెడ్డిపల్లె : బక్రీద్ పండుగను పురస్కరించుకొని బైరెడ్డిపల్లెలో శనివారం నిర్వహించిన గొర్రెల వారపు సంత రైతులతో కిటకిటలాడింది. మరో వారం రోజుల్లో బక్రీద్ పండుగ ఉండడంతో కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల నుంచి ముస్లింలతో పాటు వ్యాపారులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి రైతులు పొట్టేళ్లను వారపు సంతకు తీసుకురావడంతో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. రూ.7 వేల నుంచి రూ.85 వేల వరకు పొట్టేళ్లు అమ్ముడుపోవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. బైరెడ్డిపల్లె–పుంగనూరు రహదారిలో వారపు సంత నిర్వహించడంతో సుమారు 2 గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది.

వాసవీమాత ఆలయ వార్షికోత్సవం

వి.కోట: పట్టణంలోని వాసవీమాత ఆలయ 12వ వార్షికోత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, ఆదిత్యాది నవగ్రహ పూజ, "సుబ్రహ్మణ్యేశ్వర పూజ, గణపతి హోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఈ పూజా కార్యక్రమాలకు మండల ఆర్యవైశ్య సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.





పూజలకు హాజరైన ఆర్యవైశ్యులు